సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
97053 47483
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజుతో మువ్వల సురేష్, లక్ష్మి

బీచ్‌రోడ్డు: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియామకమైన కె.కె.రాజును గురువారం 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మరింత కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

పోలమాంబ హుండీ ఆదాయం రూ.2.93 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానం హుండీ ఆదాయాన్ని గురువారం ఈవో గాయత్రి పర్యవేక్షణలో లెక్కించారు. వారం రోజులకు గానూ హుండీల ద్వారా రూ.2,93,258 నగదు, 14 గ్రాముల బంగారం, 280 గ్రాముల వెండి వచ్చినట్లు గాయత్రి తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం సభ్యులు, మూడో పట్టణ పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలాం పార్కులోని కోర్టు–2లో గురువారం పైడిరాజు మెమోరియల్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. గ్రౌండ్‌లో ఉన్న వారే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి 15 జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. గురువారం ఉదయం, సాయంత్రం ఈ పోటీల్లో పాల్గొన్న జట్లకు లీగ్ మ్యాచ్‌లు ఆడించామని, శుక్రవారం ఉదయం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించి, విజేతలకు జ్ఞాపికలను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు పల్లా శ్రీను, పల్లా శివ, ప్రసాద్, ఒమ్మి కోటి, ఒమ్మి జగ్గారావు, వంశీ, చిన్న, పల్లా ప్రసన్న, మహేష్ మణి, జనసేన నాయకులు పీల వెంకట పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఇద్దరిపై దాడి

ఎంవీపీకాలనీ: నిర్లక్ష్యంగా ఆటో నడపడంపై ప్రశ్నించినందుకు ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఎంవీపీ కాలనీ అంజయ్యనగర్‌కు చెందిన కుంచం రాజేష్ ఓ పత్రికలో సీనియర్ ఫొటోగ్రాఫర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గురువారం అంజయ్యనగర్ నుంచి తన ద్విచక్ర వాహనంపై రాజేష్ వస్తుండగా.. ఎంవీపీ కాలనీ సెక్టార్–9లోని డీఆర్‌డీఏ కార్యాలయ సమీపంలో అకస్మాత్తుగా.. నిర్లక్ష్యంగా వచ్చిన ఓ ఆటో అతడి వాహనాన్ని ఢీకొట్టబోయింది. దీంతో కొంచెం చూసుకొని వెళ్లండని ఆటో డ్రైవర్‌కు రాజేష్ చెప్పగా.. మద్యం మత్తులో ఆటోలో నుంచి వచ్చిన పవన్, రాజేష్ అనే ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. పక్కనే ఉన్న కృష్ణ అనే వ్యక్తి కూడా వారిని ఆపే ప్రయత్నం చేయగా.. అతడిపైనా దాడి చేశారు. ఈ ఘటనపై ఫొటోగ్రాఫర్ రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటిపై దాడి.. కేసు నమోదు

ఎంవీపీకాలనీ: గుర్తు తెలియని వ్యక్తులు తన ఇంటిపై ఈ నెల 22న దాడికి పాల్పడ్డారంటూ జీవీఎంసీ 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య భర్త గేదెల నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఈ నెల 22వ తేదీ రాత్రి దల్లైవారి వీధి పెదవాల్తేరులోని గేదెల నాగరాజు అపార్ట్‌మెంట్‌లోకి ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని కొందరు వ్యక్తులు ప్రవేశించారు. ఇంటి బయట పూలకుండీలను ధ్వంసం చేశారు. ఇంట్లో ఉన్న నాగరాజు తల్లిదండ్రులను బయటకు పిలిచి బెదిరించడంతోపాటు అసభ్య పదజాలంతో దూషించారు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాదాలకు c/o వాల్తేర్ డిపో



- యాజమాన్యం కక్షసాధింపులపై ఉద్యోగుల ఆందోళన
- ఇటీవల చంద్రశేఖర్ అనే డ్రైవర్‌ను సస్పెండ్ చేసిన డీఎం
- సస్పెన్షన్ ఎత్తివేస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు బేఖాతర్
- రిలే నిరాహార దీక్షలకు దిగిన పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్



డ్రైవర్ చంద్రశేఖర్‌కు మద్దతుగా రిలే దీక్షలు చేస్తున్న యూనియన్ నాయకులు

ఎంవీపీకాలనీ: ఏపీఎస్ ఆర్టీసీ వాల్తేర్ డిపో యాజమాన్యం తీరును నిరసిస్తూ పలువురు ఉద్యోగులు నిరసన బాటపట్టారు. సమర్థవంతమైన కార్యకలాపాలు.. ఉద్యోగుల సంక్షేమానికి సమ ప్రాధాన్యమివ్వాల్సిన యాజమాన్యం.. ఉద్యోగుల పట్ల కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తుండటమే ఇందుకు కారణం. దీంతో ఇక్కడి ఉద్యోగులు నిత్యం వారి హక్కుల కోసం యాజమాన్యంతో పోరాడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇటీవల పాత పోస్టాఫీస్ ఆర్టీసీ బస్టాప్ వద్ద ఇద్దరు వాల్తేర్ డిపో ఉద్యోగుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ విషయంలో డిపో మేనేజర్ వ్యవహరించిన తీరు ప్రస్తుతం మరో వివాదానికి దారితీసింది. మా మధ్య ఎలాంటి **వివాదం** లేదని, సరదా సంభాషణలో **భాగంగా** చిన్నపాటి వాగ్వాదం మాత్రమే జరిగిందని ఇరువురూ డిపో యాజమాన్యానికి ఒప్పంద పత్రం సమర్పించారు. అయినప్పటికీ చంద్రశేఖర్ అనే డ్రైవర్‌ను వాల్తేర్ డిపో మేనేజర్ వారం రోజుల తరువాత సస్పెండ్ చేయడం ఉద్యోగులకు ఆగ్రహాన్ని తెప్పించింది. దీంతో పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ న్యాయం కోరుతూ రిలే నిరాహార దీక్షలు చేపట్టి.. 12 రోజులుగా కొనసాగిస్తోంది. గతంలోనూ ఇటువంటి అక్రమ సస్పెన్షన్లపై పలు యూనియన్లు గళమెత్తాయి.



వాల్తేర్ డిపో యాజమాన్యం తీరును నిరసిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

చిన్నపాటి వివాదానికే సస్పెన్షన్

ఫిబ్రవరి 1న మధ్యాహ్నం 12 గంటల సమయంలో పాత పోస్టాఫీస్ ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద వాల్తేర్ డిపో డ్రైవర్ పి.చంద్రశేఖర్.. మరో డ్రైవర్‌కు మధ్య చిన్నపాటి వాగ్వాదం జరిగింది. గతంలో జరిగిన ఓ విషయంపై ఒకరిని ఒకరు ప్రశ్నించుకోవడం దీనికి కారణమైంది. వాగ్వాదం తరువాత ఇద్దరు డ్రైవర్లు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సమయంలో అక్కడే ఉన్న కొందరు ఉద్యోగులు డిపో మేనేజర్‌కు సమాచారమివ్వడంతో నిమిషాల వ్యవధిలో ఆయన అక్కడికి చేరుకున్నారు. మధ్యాహ్నం 2.10 గంటల డ్యూటీ ఎక్కేందుకు అక్కడే ఉన్న చంద్రశేఖర్‌ను గొడవ ఏంటని మేనేజర్ ప్రశ్నించగా.. ఏదో సరదా సంభాషణలో వాగ్వాదం జరిగిందని తెలిపారు. దీంతో సంతకం పెట్టి వెళ్లి డ్యూటీ ఎక్కాలని ఆదేశించడంతో చంద్రశేఖర్ వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తరువాత చంద్రశేఖర్‌కు మేనేజర్ ఫోన్ చేసి డ్యూటీ ఎక్కొద్దని ఆదేశించారు. అనంతరం ఫిబ్రవరి 3న ఇద్దరు డ్రైవర్లను డీఎం పిలిచి విచారణ చేశారు. ఈ క్రమంలో ఇద్దరు ఈ ఘటనపై తాము ఎవ్వరికీ ఫిర్యాదు చేయలేదని, అవసరమైతే రాజీ పత్రం ఇస్తామని చెప్పి డిపో మేనేజర్ కార్యాలయం ఉన్నతాధికారులకు రాజీ పత్రం రాసిచ్చారు. ఫిబ్రవరి 7న చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేశారు.

హైకోర్టు ఉత్తర్వులు బేఖాతర్

ఎటువంటి సమగ్రమైన ఫిర్యాదు లేకపోయినా చంద్రశేఖర్‌ను డిపో మేనేజర్ సస్పెండ్ చేయడంతో ఫిబ్రవరి 18న అతడు హైకోర్టును ఆశ్రయించాడు. అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ కోర్టులో పిటిషన్ వేయడంతో 20వ తేదీన కోర్టు స్టే ఇచ్చింది. చంద్రశేఖర్ సస్పెన్షన్ ఆర్డర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. డిపో మేనేజర్ సుధాకర్‌కు ఆ ఆర్డర్‌ను సమర్పించినా.. ఆయన పట్టించుకోలేదు. పరిశీలిస్తానని చెప్పి చంద్రశేఖర్‌ను పంపించేశారు. దీంతోపాటు మార్చి 13న ఈ ఘటనపై మరో ఎంక్వయిరీ వేసి గొడవ జరిగినట్లు మరో డ్రైవర్‌పై ఒత్తిడి చేసి ఫిర్యాదు చేయించారు. దీంతో చంద్రశేఖర్ కండెమ్ట్ ఆఫ్ కోర్ట్ కింద హైకోర్టులో మరో పిటిషన్ దాఖలు చేయగా.. ఈ నెల 28న తమ ముందు హాజరు కావాలని వాల్తేర్ డిపో మేనేజర్‌కు కోర్టు సూచించింది.

కావాలనే కాలయాపన చేస్తున్నారు..



నా సర్వీసు మొత్తంలో నిబద్ధతతోనే విధులు నిర్వర్తిస్తున్నాను. చిన్నపాటి వాగ్వాదాన్ని షాకుగా చూపి నన్ను సెస్పెండ్ చేశారు. దీని వెనుక ఓ పెద్ద ఆర్టీసీ యూనియన్ కుట్ర ఉంది. తొలుత సంతకం పెట్టి డ్యూటీకి వెళ్లిపోమన్న డిపో మేనేజర్.. తరువాత ఫోన్ చేసి డ్యూటీకి హాజరవ్వద్దని సూచించడం, పైనుంచి తనపై ఒత్తిడి ఉందని చెప్పడమే ఇందుకు నిదర్శనం. సస్పెన్షన్ ఎత్తివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ డీఎం కావాలనే కాలయాపన చేస్తున్నారు. హైకోర్టు స్టేను ఇంప్లిమెంట్ చేసి వాల్తేర్ డిపోలోనే విధులు కేటాయించాలి.

– **పి.చంద్రశేఖర్**, సస్పెండ్ అయిన డ్రైవర్

అధికారులు పక్షపాత ధోరణి వీడాలి



ఆర్టీసీ ఉద్యోగులందరికీ ఒకే న్యాయం ఉండాలి. ఉద్యోగుల సంక్షేమంలో అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరించడం సరికాదు. కొన్ని ఆర్టీసీ యూనియన్లకు కొమ్ముకాసేలా వాల్తేర్ డిపో యాజమాన్యం వ్యవహరిస్తోంది. కొందరిని మాత్రమే శిక్షించాలని చూస్తోంది. గతంలో డ్రైవర్లు, ఉద్యోగుల మధ్య పలు గొడవలు జరిగినా.. సస్పెండ్ చేయలేదు. డ్రైవర్ చంద్రశేఖర్ విషయంలో యాజమాన్యం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. మా యూనియన్ తరఫున అతడికి న్యాయం జరిగే వరకు నిరసన దీక్షలు కొనసాగిస్తాం.

– **డి.ఎస్.బాబు(డ్రైవర్)**, అధ్యక్షుడు, పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ వాల్తేర్ డిపో

ఉగ్రదాడిలో అమరులకు అశ్రు నివాళులు



ఏయూ గేటు ముందు నినాదాలు చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



ఏయూలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో అధ్యాపకులు, విద్యార్థుల నిరసన

విశాఖ విద్య: కశ్మీర్ పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిపై అంతటా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. దీనిలో భాగంగా గురువారం సాయంత్రం ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు విద్యార్థులు, అధ్యాపకులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఉగ్రమూకల దాడిలో మృతి చెందిన వారికి అశ్రు నివాళులర్పించారు. ముందుగా ఏయూ ప్రధాన గేటు ముందు ఫ్లెక్సీలు పట్టుకొని ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఎట్టకేలకు 'పశుగణ' కార్యాలయానికి ముఖద్వారం ఏర్పాటు

ఆరిలోవ: పశు సంవర్ధక శాఖలో భాగమైన రాష్ట్ర పశుగణ వ్యవస్థాపక యాజమాన్య సంస్థ కార్యాలయానికి ఎట్టకేలకు ముఖద్వారం ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి నుంచి విమ్స్‌కు వెళ్లే రోడ్డు పక్కన విశాలమైన స్థలంలో రాష్ట్ర స్థాయి కార్యాలయాన్ని నిర్మించారు. పెద్ద భవనాలు ఏర్పాటు చేసి నిత్యం పాడి రైతులకు, పశు సంవర్ధక శాఖ సిబ్బందికి శిక్షణలు ఇస్తున్నారు. ఇక్కడ నాలుగేళ్ల కిందట నిర్మించి విధులు నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కార్యాలయం ముందు ఎలాంటి బోర్డు, ముఖద్వారం ఏర్పాటు చేయకుండా అధికారులు వదిలేశారు. దీంతో ఇంత పెద్ద కార్యాలయం దేనికి సంబంధించినదో తెలియక స్థానికులు తెల్లముఖం వేస్తున్నారు. దీంతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఇక్కడ జరుగుతున్న శిక్షణ కోసం వస్తున్న పాడి రైతులు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది నేమ్ బోర్డు లేకపోవడంతో ఈ కార్యాలయం చుట్టే తిరగాల్సి వస్తోంది. ఇప్పుడు ముఖద్వారం వద్ద గేటు, నేమ్ బోర్డు ఏర్పాటు చేయడంతో ఈ సమస్య పరిష్కారమైంది.



రాష్ట్ర పశుగణ వ్యవస్థాపక యాజమాన్య సంస్థ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గేటు

ఘనంగా సత్యసాయిబాబా ఆరాధనోత్సవం

ఎంవీపీకాలనీ: శ్రీ సత్యసాయి బాబా 14వ ఆరాధన మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీ ప్రేమసదన్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రత్యేక అలంకరణలో గల సత్యసాయి చిత్రపటం వద్ద ఆశీస్సులు తీసుకున్నారు. ఉదయం ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తనతోపాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రేమసదన్‌లో రుద్రాభిషేకం, శ్రీ సత్యసాయి సహస్రనామ పుష్పార్చన, విశ్వమానవ కల్యాణం, శ్రీ సత్యసాయి గాయత్రీ విశ్వశాంతి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను అత్యంత వైభవంగా చేపట్టారు. సత్యసాయి విద్యావిహార్ మేథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ భగ్గం సురేష్ అందించిన ఆధ్యాత్మిక ఉపన్యాసం భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సేవా కార్యక్రమాలు, వేదపఠనం, అష్టోత్తరం వంటి కార్యక్రమాల్లో యువత, సేవా సంస్థల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



సత్యసాయికి పూజలు చేస్తున్న భక్తులు

క్రైస్తవ ప్రచారకులపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

ఆరిలోవ: క్రైస్తవ ప్రచారకులపై జరిగిన దాడిపై క్రిస్టియన్ సొసైటీ ప్రతినిధులు గురువారం ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏపీ క్రిస్టియన్ సొసైటీ చైర్మన్ జేమ్స్ కుంపట్ల ఆధ్వర్యంలో కొందరు క్రైస్తవులు విమ్స్ ఆవరణలోని ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు అందించారు. ఈ సందర్భంగా జేమ్స్ మాట్లాడుతూ జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లో ఓ క్రైస్తవ కుటుంబం ఈ నెల 20న ఈస్టర్ పండగ సందర్భంగా బైబిల్ పత్రికలు పంపిణీ చేసిందన్నారు. ఆ సమయంలో వారిపై కొందరు బహిరంగంగా దాడి చేసి వీడియోలు తీశారన్నారు. వారిపై మతపరమైన దూషణలు చేసి బెదిరించినట్లు తెలిపారు. ఈ ఘటనతో ఆ కుటుంబ సభ్యులు ప్రాణభయంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారన్నారు. కొంత కాలంగా రాష్ట్రంలో క్రిస్టియన్ మైనారిటీలపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విశాలాక్షినగర్‌లో జరిగిన సంఘటనపై ఆరిలోవ పోలీసులకు వివరాలతో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వారిలో క్రైస్తవ నాయకులు సుధాకర్ పాల్, ఆలివర్ రాయి, జార్జిబాబు, శామ్యూల్, ఐజా, హెన్రీ తదితరులు ఉన్నారు.



ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లిన క్రైస్తవులు

నిరాశ్రయ వసతి గృహానికి అభాగ్యుల తరలింపు

సీతమ్మధార: చినవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకున్న అయిదుగురు పురుషులు, ఇద్దరు మహిళలను గురువారం డిశ్చార్జి చేశారు. వీరిని ద్వారకానగర్‌లోని టీఎస్సార్ కాంప్లెక్స్‌లో గల ఏయూటీడీ జీవీఎంసీ నిరాశ్రయ వసతిగృహాలకు తరలించారు. వీరిని కుటుంబ సభ్యులు తీసుకుళ్లడానికి రాకపోవడంతో ఏయూటీడీ సంస్థ స్వచ్ఛందంగా వీరికి ఆశ్రయం కల్పించింది. వారిచేత మందులు వాడిస్తూ, పూర్తి వివరాలు తెలుసుకుని శ్రద్ధా ఫౌండేషన్ సహకారంతో కుటుంబ సభ్యులకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నట్లు ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు శ్రద్ధా సోషల్ వర్కర్లు గౌతం, హరీష్ పాల్గొన్నారు



డిశ్చార్జి అయిన రోగులతో ఏయూటీడీ కార్యదర్శి వాసు

పాలిసెట్ హాల్ టికెట్లు సిద్ధం



మురళీనగర్: పాలిసెట్ హాల్ టికెట్లు సిద్ధంగా ఉన్నాయని విశాఖ జిల్లా పాలిసెట్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.నారాయణ రావు ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసిన వారు పాలిసెట్‌ఏపీ.ఎస్‌బీటీఈ.ఇన్ వెబ్ సైట్‌లో నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాలిసెట్‌కు జిల్లాలో సుమారు 14,000 మంది దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఈనెల 30 తేదీన ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తామని చెప్పారు.

డెవలప్‌మెంట్ లీడర్‌షిప్ పీజీ డిప్లొమా ప్రవేశాలు

బీచ్‌రోడ్డు: డెవలప్‌మెంట్ లీడర్‌షిప్ పీజీ డిప్లొమా కోర్సులో ప్రవేశాలు ప్రారంభించామని అజీమ్ ప్రేమ్‌జీ స్కూల్ ఆఫ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ అరిమా మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. పనిచేస్తూ చదువుకునే వారి కోసం 11 నెలల డిప్లొమా ప్రోగ్రాం రూపొందించామని పేర్కొన్నారు. ఇది మూడు సెషన్లుగా ఉంటుందని, ఆన్–క్యాంపస్, ఆన్‌లైన్ లెర్నింగ్ మిశ్రమంగా కలదన్నారు. ప్రస్తుతం నాయకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్న వారు లేదా త్వరలో అలాంటి పాత్రలు చేపట్టబోయే వారు దీనికి అర్హులని చెప్పారు. ఎన్జీవోలు, సామాజిక ఉద్యమాలు, గ్రామీణ సంఘటనల్లో పని చేస్తున్న వారు ఈ కోర్సు చేయవచ్చన్నారు. వివరాలు, నమోదు కోసం https://azimpremjiuniversity.edu.in/programmes/development-leadership వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.



భానుడి తేజం.. నయన మనోహరం

సూర్యోదయాన్ని వీక్షిస్తే మనసుకు ఎంతో ఉత్తేజం కలుగుతుంది. విశాఖ సాగర తీరానికి సమీపంలో నివసించే వారికి ఈ సుందర దృశ్యం నిత్యం సాక్షాత్కరిస్తుంది. ఉదయం 5 నుంచి 6 గంటల సమయంలో సముద్ర గర్భం నుంచి బంగారు వర్ణంతో భానుడు బయటకు వస్తున్నాడా అన్న చందంగా భానోదయం ఉంటుంది. దాదాపు ఒక గంట పాటు సూర్యుడి గమనాన్ని, ఉషా కిరణాలను నిశితంగా ఇసుక తిన్నెలపై కూర్చుని పరిశీలిస్తూ గడిపితే రోజంతా కావలసిన కొత్త శక్తిని, ఉత్సాహాన్ని మనస్సులో నింపుకొని వెళ్లవచ్చు. ఇంకెందుకు ఆలస్యం.. వెళ్లండి.. భానోదయాన్ని వీక్షించండి. – ఏయూక్యాంపస్

బీచ్ కబడ్డీ పోటీలకు విశాఖ జట్ల ఎంపిక రేపు

ఎంవీపీకాలనీ: రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లాల పురుషులు, మహిళల జట్లను ఈ నెల 26న ఎంపిక చేయనున్నట్లు విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.ఎస్.వి.ప్రసాదరెడ్డి తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఆర్కే బీచ్ వేదికగా ఈ జట్లు ఎంపిక జరుగుతుందన్నారు. 85 కేజీలలోపు పురుషులు, 75 కేజీలలోపు మహిళలు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన జట్లు మే 2 నుంచి 4వ తేదీ వరకు కాకినాడ బీచ్‌లో జరిగే 12వ రాష్ట్ర అంతర్ జిల్లాల బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో విశాఖ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. వివరాలకు 96666 55355, 80084 85344 నంబర్లను సంప్రదించాలని సూచించారు

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: ఆరిలోవ ఫీడర్ 33/11 కేవీ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సంతపాలెం, తోటగరువు, రవీంద్రనగర్, గాంధీనగర్, కైలాసనగర్, శ్రీహరినగర్, ముస్తఫా కాలనీ, బాలాజీనగర్, అన్నానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ఎంవీపీ సెక్టార్–1, 2 పరిధిలో..

ఎంవీపీకాలనీ: ఎంవీపీ సెక్టార్–1లోని 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడు తుందని ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఎంవీపీ సెక్టార్–1, సెక్టార్–2, కొత్త వెంకోజీపాలెం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఈఈ కోరారు.

నాణ్యమైన విద్యతోనే మెరుగైన ఫలితాలు

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం ద్వారానే మెరుగైన ఫలితాలు సాధించగలమని, ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యా శాఖ ఆర్జేడీ విజయ్‌భాస్కర్ సూచించారు. ఆర్జేడీ కార్యాలయంలో గురువారం అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పదో తరగతి పరీక్షల్లో 588, 574 మార్కులతో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విష్ణువర్ధన్ సాయి, కవితలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో అనేక సంస్కరణలు తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు, గణిత ఉపాధ్యాయుడు సుభాష్ పాల్గొన్నారు.



టెన్త్ టాపర్లు విష్ణువర్ధన్‌సాయి, కవితను అభినందిస్తున్న ఆర్జేడీ విజయ్‌భాస్కర్

వన్ వరల్డ్ స్కూల్ విజయకేతనం

బీచ్‌రోడ్డు: లాసన్స్ బే కాలనీ పెదవాల్తేరులోని వన్ వరల్డ్ స్కూల్ బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి విజయకేతనం ఎగురవేసింది. విద్యార్థి గణేష్ మౌళి 581/600 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచాడు. 578 మార్కులతో హరిచంద్రిక, ప్రీతిహాసలు ద్వితీయ స్థానం, 576 మార్కులతో ప్రదీప్‌కుమార్ తృతీయ స్థానంలో నిలిచారు. పరీక్షకు హాజరైన మొత్తం 44 మంది విద్యార్థుల్లో 30 మంది 500కు పైగా మార్కులు సాధించారు. మరో 13 మంది 70 శాతం పైగా మార్కులతో పాసయ్యారు. ఇక్కడ చదువుతున్న పేద, దిగువ మధ్యతరగతికి చెందిన పిల్లలు టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించారని స్కూల్ డైరెక్టర్ శ్రీ సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఇంతటి ఘన విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించిన ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



గణేష్ మౌళి, 581/600 | హరిచంద్రిక, 578/600 | ప్రీతిహాస, 578/600

